# పోతనభాగవతంలో రసగుళికలు

– ఆర్.శర్మ దంతుర్తి



## 100 వ భాగం

## భగవంతుడి అవతార వైభవం, రామావతారం

రామావతారం చెప్తూ ఇప్పుడు నారదుడితో అంటున్నాడు బ్రహ్మ. మొత్తం రామాయణం అంతా సులభంగా పదీ పదిహేను పద్యాలలో చెప్పేస్తాడు పోతన ఈ స్కంధంలో. పుట్టిన రాముడికి విశ్వామిత్రుడు దివ్యాస్త్రాలు ఇచ్చాక జనక మహారాజు దగ్గిరకి తీసుకెళ్ళాడు రామలక్ష్మణులని. శివదనుర్భంగం అవలీలగా గావించాక సీతాదేవిని వివాహం చేసుకుని వెనకకి వచ్చిన రాముడికేమైందో చెప్తున్నాడు.

క. రామున్ మేచకజలద
శ్యామున్ సుగుణాభిరాము సద్వైభవసు
త్రామున్ దుష్టనిశాటవి
రాముం బొమ్మనియెఁ బంక్తిరథుఁ డడవులకున్. [2-160]

నల్లని (మేచక) మేఘఛ్ఛాయతో (జలద శ్యామున్), సుగుణాభిరాముడైన రాముణ్ణి, రాక్షసులని సంహరించే రాముణ్ణి, దశరథుడు (పంక్తిరధుడు; పంక్తి – పది/దశ) అడవులకి పొమ్మన్నాడు.

చ. అరుదుగ లక్ష్మణుండు జనకాత్మజయుం దనతోడ నేఁగుదే
నరిగి రఘూత్తముండు ముదమారఁగ జొచ్చెఁ దరక్షు సింహ సూ
కర కరి పుండరీక కపి ఖడ్గ కురంగ వృకాహి భల్ల కా
సర ముఖ వన్యసత్త్వచయ చండతరాటవి దండకాటవిన్. [2-162]

అపూర్వం అన్నట్టూ కూడా సీతా (జనక+ఆత్మజ = జనకుడి మానస పుత్రిక), లక్ష్మణులు కూడా బయల్దేరేసరికి రాముడు సంతోషంగానే (ముదమారగ) సింహాలు, అడవి పందులూ, పులులూ, కోతులూ (కపి) అనేటువంటి మృగాలు ఉన్న భయంకరమైన (చండతర) దండక వనాన్ని చేరాడు.

ఇక్కడనుంచి కథ తెల్సినదే కదా? 'రామా నువ్వు ఇక్కడే ఉండవచ్చు కానీ ఇంకా ముందుకి వెళ్తే బావుంటుంది' అంటూ దండకారణ్యం లోలోపలకి తోస్తారు మునులందరూ – అగస్త్యాశ్రమం దాకా. అగస్త్యుడికి జరగబోయే కథంతా ముందే తెల్సు కనక, 'రామా ఈ కోదండం, ఈ అక్షయ తూణీరాలూ నీ దగ్గిరే ఉంచు' అంటూ మరో కొన్ని ఆయుధాలు ఇస్తాడాయన. అలా అన్నీ తన దగ్గిర అమరాక, బంగారు లేడీ, సీతాపహరణం వీటన్నిటికీ సిద్ధమౌతుంది రంగం. ఈ లోపుల వాలి సుగ్రీవుణ్ణి ఇంట్లోంచి పొమ్మనడం జరిగాక రాముడు సుగ్రీవుణ్ణి వెతుక్కుంటూ కథ ఇంకా ముందుకి.

క. ఆ వనమున వసియించి నృ
పావననయశాలి యిచ్చె నభయములు జగ
త్పావన మునిసంతతికిఁ గృ
పావననిధి యైన రామభద్రుం డెలమిన్. [2-163]

ఇలా వనవాసానికి వచ్చిన రాముడు అక్కడున్న మునిజనానికి రాక్షసుల బెడదలేకుండా చేస్తానని అభయం ఇచ్చాడు. ఎందుకంటే, ఆయన కృపావననిధి (దయాసముద్రుడు).

క. ఖరకర కుల జలనిధి హిమ
కరుఁ డగు రఘురామవిభుఁడు గఱకఱితోడన్
ఖరుని వధించెను ఘనభీ
కర శరముల నఖిల జనులుఁ గర మరుదందన్. [2-164]

సూర్యవంశానికి చల్లదనం కలిగించేటువంటి రఘురాముడు భయంకరమైన అస్త్రాలతో ఖరుడనే రాక్షసుణ్ణి సంహరించాడు. ఈ పద్యంలో క, ఖ అనే అక్షరాలతో పోతన ఎటువంటి భావం పలికించాడో గమనించండి. ఖరకుల =

ఖర – ఎండని కలింగిచే సూర్యుడు, కుల –వంశం. హిమకరుడు – చల్లదనం కలిగించేవాడు, చంద్రుడు; కరకరితోడన్ – కరకరి – కాఠిన్యం; ఈ పద్యం విచిత్రంగా ఉందా? అయితే కింద పద్యం కూడా చూడండి.

క. హరిసుతుఁ బరిచరుఁగాఁ గొని
హరిసుతుఁ దునుమాడి పనిచె హరిపురమునకున్;
హరివిభునకు హరిమధ్యను
హరిరాజ్యపదంబు నిచ్చె హరివిక్రముఁడై. [2-165]

సింహ పరాక్రమంతో (హరి విక్రముడై) రాముడు సుగ్రీవుణ్ణి (హరి సుతుడు – సూర్యుని కొడుకు) స్నేహితుడుగా చేసుకుని (పరిచరుగాగొని) వాలిని (మళ్ళీఅదే పదం, హరి సుతుడు – సూర్యుని కొడుకు) సంహరించి యమపురికి (హరి పురమునకున్) పంపించాడు. సుగ్రీవుడికి (హరి విభునకున్ – కోతుల రాజుకి), రుమ అనే భార్యని (హరి మధ్యను – హరి-సింహము వంటి నడుము ఉన్నావిడ) ఇచ్చి కిష్కింధకి (హరి రాజ్యపదంబు – కోతుల రాజ్యం) రాజుగా చేసాడు.

ఇప్పుడు చెప్పండి తెలుగులో భాగవతం పోతన స్వంతంగా తనకి తానై రాసాడా లేక రామభద్రుడు రాయించాడా? ఇదే, భాగవతం రాయడానికి మొదలుపెడుతూ పోతన ఎంతో వినయంగా చెప్పుకున్న, "పలికించెడువాడు రామభద్రుండట" అనే విషయం.

అలా సుగ్రీవుడి సహాయంతో కపిసేనలని వెంటబెట్టుకుని సముద్రం ఒడ్డుకి చేరాడు సీతని తెచ్చుకోవడం కోసం. అక్కడ సముద్రం దారి ఇవ్వననేసరికి కోపం వచ్చింది.

మ. వికటభ్రూకుటిఫాలభాగుఁ దగుచున్ వీరుండు క్రోధారుణాం
బకుడై చూచిన యంతమాత్రమున నప్పాథోధి సంతప్తతో
యకణగ్రాహ తిమింగిలప్లవ ఝులీ వ్యాళప్రవాళోర్మికా
బక కారండవ చక్ర ముఖ్య జలసత్వశ్రేణితో నింకినన్. [2-167]

వ. అయ్యవసరంబున సముద్రుండు కరుణాసముద్రుం డగు శ్రీరామభద్రుని శరణంబు సొచ్చినం గరుణించి యెప్పటి యట్ల నిలిపి నలునిచే సేతువు బంధింపించి తన్మార్గంబునం జని. [2-168]

మహావీరుడైన రాముడు కోపంతో సముద్రం కేసి చూసేసరికి అనేక జలచరాలు, పక్షులూ ఉన్న ఆ మహాసముద్రం కుతకుత ఉడుకుతూ ఇంకిపోవడం మొదలైంది. ఈ లోపున సముద్రుడు రాముణ్ణి శరణు అడిగి సేతువు కట్టడానికి ఓ మార్గం చూపించాడు. అలా సముద్రం దాటి ఆవలి ఒడ్డుకి చేరాడు రాముడు.

మ. పురముల్ మూఁడును నొక్కబాణమున నిర్మూలంబు గావించు శం
కరు చందంబున నేర్చె రాఘవుఁడు లంకాపట్టణం బిద్ధగో
పుర శాలాంగణ హర్మ్య రాజభవనప్రోద్యత్ప్రతోళీ కవా
ట రథాశ్వద్విప శస్త్ర మందిర నిశాటశ్రేణితో వ్రేల్మిడిన్. [2-169]

శివుడు ఒకే ఒక బాణంతో త్రిపురాసుర సంహారం చేసినట్టూ (శంకరు చందంబునన్), పెద్ద పెద్ద గోపురాలు, మేడలూ, ముంగిళ్ళూ ఉన్న లంకానగరాన్ని, అక్కడ ఉన్నఆయుధాగారాలనీ (శస్త్ర మందిర), రాక్షసులనీ (నిశాటశ్రేణితో) చిటికలో (వ్రేల్మిడిన్), రాఘవుడు భస్మీపటలం చేసాడు. మరోసారి కింద పద్యంలో పోతన పద్యాపాటవం చూడబోతున్నాం. భగవంతుడికి గల 'హరి' అని పేరుతో అనేక రకాల ప్రయోగాలు చేయడం సులభమే అనేవారికి రావణుడు అనే పదంతో కూడా పోతన ఎలా ఆటాడుకున్నాడో జాగ్రత్తగా గమనించండి.

క. రావణు నఖిల జగద్వి
ద్రావణుఁ బరిమార్చి నిలిపె రక్షోవిభుఁగా
రావణుననుజన్ముని నై
రావణసితకీర్తి మెఱసి రాఘవుఁ డెలమిన్. [2-170]

లోకంలో ఉండే వారిని తరిమి కొట్టే (జగత్ విద్రావణున్) రావణుణ్ణి పరిమార్చి, రావణుడి తమ్ముడిని (రావణుననుజన్ముని – రావణుడి, తోబుట్టువుని) లంకకి రాజుగా చేసి, రాఘవుడు తెల్లని కీర్తితో (ఐరావణసితకీర్తి – ఐరావతంవంటి తెల్లటి) ప్రకాశించాడు.

సీ. ధర్మ సంరక్షకత్వప్రభావుం డయ్యు
ధర్మవిధ్వంసకత్వమునఁ బొదలి
ఖరదండనాభిముఖ్యముఁ బొంద కుండియు
ఖరదండ నాభిముఖ్యమున మెఱసి
బుణ్యజనావన స్ఫూర్తిఁ బెంపొందియుఁ
పుణ్యజఁనాంతక స్ఫురణఁ దనరి
సంతతాశ్రిత విభీషణుఁడు గాకుండియు
సంతతాశ్రిత విభీషణత నొప్పి [2-171]

తే. మించెఁ దనకీర్తిచేత వాసించె దిశలు;
దరమె నుతియింప జగతి నెవ్వరికినైనఁ
జారుతరమూర్తి నవనీశచక్రవర్తిఁ
బ్రకటగుణసాంద్రు దశరథరామచంద్రు. [2-171.1]

వ.అట్టి శ్రీరామావతారంబు జగత్పావనంబును నస్మత్ప్రసాద కారణంబును నై నుతికెక్కె; నింకఁ గృష్ణావతారంబు వివరించెద వినుము. [2-172]

మొదటి రెండు పాదాలు చదివితే రాముడు ధర్మస్వరూపుడు కదా? ఆయన ధర్మవిధ్వంసకం చేయడం ఏమిటి అనిపించడం సామాన్యం. అలాగే మిగతా పాదాలలో కూడా. ధర్మాన్ని రక్షించేవాడైనా, శివధనుర్భంగం చేసాడు కనక ధర్మవిధ్వంసకం. అలగే ఖరదండన (కఠిన శిక్షలు) చేసేవాడు కాకపోయినా ఖరదండన (ఖరుడనే రాక్షసుణ్ణి చంపాడు) చేసాడు. పుణ్యజనులకి (రాక్షసులకి) ఆశ్రితుడు (విభీషణుడు) కాకపోయినా విభీషణుడికి ఆశ్రయం ఇచ్చాడు. అలా తన కీర్తిని దశదిశలా వ్యాపింపచేసాడు. ఇటువంటి రాముణ్ణి కీర్తించడానికి లోకంలో ఎవరికీ సాధ్యపడదు.

ఒకసారి అవలోకిద్దాం. ప్రతీసారి బ్రహ్మ ఒక అవతారం గురించి చెప్పేటప్పుడు 'ఇటువంటి రాముడి గురించి, "ఇటువంటి మత్స్య/కూర్మ/వరాహ రూపుడైన భగవంతుడిని స్తుతించడం ఎవరికీ సాధ్యం కాదు" అంటాడేమిటనే

విషయం. భగవంతుడు అవ్యక్తుడు, అవ్యయుడు, అనంతుడూ కదా, అందువల్ల ఆయన ఇలా, అలా ఉంటాడనేది చెప్పడం కష్టం. మనకి కనిపించిన భగవంతుడి అవతారాన్ని చెప్పగలం గానీ మొత్తం భగవంతుడు అంటే ఇదీ అని ఎప్పటికీ చెప్పలేం. అసలు మనం అలా చెప్పగలిగేది మన బుద్ధి, మనస్సులమీద ఆధారపడి ఉంటుంది కనక అది అవ్యక్తం అవదు కాబట్టి బ్రహ్మ అలా చెప్తున్నాడు అనుకోవచ్చు. ఇదే విషయం ముందు వ్యాసాల్లో చెప్పుకున్నప్పుడు ఒక శ్లోకంలో చూసాం. మరోసారి ఆ శ్లోకం గుర్తు చేసుకుని ఈ నెల వ్యాసం ముగిద్దాం.

అసితగిరి సమం స్యాత్ కజ్జలం సింధుపాత్రే
సురతరువరశాఖా లేఖనీ పత్రముర్వీ
లిఖతి యది గృహీత్వా శారదా సర్వకాలం
తదపి తవ గుణానామీశ పారం న యాతి (శివమహిమా స్తోత్రం 32)

సరస్వతీ దేవి కల్పవృక్షం కొమ్మని కలంగా తీసుకుని భూమండలమంత కాయితం మీద సర్వకాల్లోనూ భగవద్విభూతి (విభూతి – విస్తారణ) రాస్తోందిట. కలంలో సిరా ఏమిటంటే కాటుక కొండ పట్టుకొచ్చి సముద్రంలో కలిపితే వచ్చేదే. ఎప్పటికీ తరిగిపోని అంత సిరా, అరిగిపోని కల్పవృక్ష శాఖ కలంగా ఉండి రాస్తున్నా భగవంతుడి గుణగణాలు రాయడానికి ఇవన్నీ సరిపోవట్లేదు. అదే అవ్యక్తం అంటే. అంటే మనం ఆయన్ని ఎంత వర్ణించినా ఇంకా పూర్తిగా తెలుసుకోనట్టే. అందుకే అంటున్నాడు బ్రహ్మ, ఆయన మహిమ వర్ణించడం ఎవరికీ సాధ్యం కాదు అని.

భగవంతుడి దయతో ఈ వ్యాసంతో పోతన భాగవతం మీద వంద రసగుళికల వ్యాసాలు పూర్తయ్యాయి. ఈ పరంపర ఇలాగే కొనసాగిద్దామని ఆశ. వచ్చే నెలలో బ్రహ్మ చెప్పబోతున్న కృష్ణావతారం గురించి చూద్దాం.

పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS